10 YEAR ANNIVERSARY 2014 - 2024

# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్

సోమవారం | 23 డిసెంబర్ 2024 | పేజీలు 8



బౌరంపేట్ ఎస్ఆర్కే కమాన్ వద్ద భారీ నిర్మాణం.. నిబంధనలకు తిలోదకాలు..

# పర్మిషన్‌లు "గోప్యంగా" పెట్టి..!
# 'పైసా' వసూల్..?

## చైన్‌మెన్ చేతిలో బౌరంపేట్.. టిపిఎస్ సంజునాకు తెలిసే ఈ వ్యవహారం అంటూ ఆరోపణలు..?



ఎస్ఆర్‌కే కమాన్ వద్ద నిర్మాణం గత జూన్‌లో తీసిన చిత్రం.. ఫైల్‌ఫోటో..

దుండిగల్ మున్సిపాలిటీ టౌన్‌ప్లానింగ్‌లో వసూల్ రాజాలు..! అక్రమ నిర్మాణాలతో లక్షలు చేతులు మారుతున్నాయని ఆరోపణలు.. పలుకుబడితో విధులు నిర్వహిస్తున్న టిపిఎస్ సంజునా బాధ్యతా రహితంగా సమాధానానికి దూరం.. వివరణకు ఫోన్ చేసినా మేడమ్ స్పందిచరు, పర్మిషన్‌లపై ప్రశ్నిస్తే సైలెంట్.. ఓ మంత్రి, ఎంపి, పలుకుబడి ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి.. అందుకే మేడమ్ ఎవరినీ లెక్కచేయరని సమాచారం.. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోరు అనే విమర్శలు ఉన్నాయి.. స్థానిక రాజకీయ నేతలు ఫోన్‌లు చేసినా..! లెక్కచేయకుండా కొందరు ప్రభుత్వ పెద్దలతో డైరెక్ట్ ఫోన్ కాల్స్ చేయించి నోరు మూయిస్తారని వినికిడి..? ఏదిఏమైనప్పటికీ దుండిగల్ మున్సిపాలిటీ టౌన్‌ప్లానింగ్‌లో "చర్యలకు తావులేదు.. వసూళ్ళకు కొదవలేదు" అన్న చందంగా తయారైంది..! ఈ వసూళ్ల వ్యవహారంలో సెటిల్మెంట్‌లకి చైన్‌మెన్‌లను పావులుగా వాడుతున్నట్లు సంబంధిత చైన్‌మెన్ అనధికారికంగా చెబుతున్నదే..! ఏ నిర్మాణానికి సంబంధించిన అనుమతుల కాపీని "మీడియాకు" ఇవ్వకూడదని చైన్‌మెన్‌లకు అల్టిమేట్ జారీచేసినట్లు వాపోతున్నారు.. చర్యలు తీసుకోకపోతే టౌన్‌ప్లానింగ్ అధికారి ఎందుకు..? వసూళ్ళకా..? ఏరియాలో సమాచారం తెలియకపోతే చైన్‌మెన్‌లు ఎందుకు..? సెటిల్మెంట్‌లకా..?

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, డిసెంబర్ 22:

- బౌరంపేట్ 'టు' మల్లంపేట్ 100 ఫీట్ల రోడ్డు ఎఫెక్ట్‌లో అక్రమ సెల్లార్‌తో భారీ నిర్మాణం..?
- అనుమతులపై ప్రశ్నిస్తే "టిపిఎస్" సమాధానానికి దూరం..!
- అక్రమమా..? సక్రమమా..? అంటూ బౌరంపేట్ చైన్‌మెన్ వేణుని ప్రశ్నిస్తే తెలియదని సమాధానం..
- దుండిగల్ మున్సిపల్ పట్టణ ప్రణాళికలో వసూల్ రాజాలు..?
- అక్రమ కట్టడాల వ్యవహారంలో చైన్‌మెన్‌లే కీలకం.. సెటిల్మెంట్‌లు చేయిస్తున్నట్లు సమాచారం..
- డిపియస్ రోడ్డులో భారీ అక్రమ షెడ్డు నిర్మాణంలో టౌన్‌ప్లానింగ్ అధికారుల సహకారం..
- మరోచోట అక్రమ షెడ్డుకు రంగులేసి.. పక్కనే కొత్త నిర్మాణ పనుల్లో చైన్‌మెన్ వేణు హస్తం..?
- చర్యలు తీసుకోకపోతే టౌన్‌ప్లానింగ్ అధికారి ఎందుకు..? వసూళ్ళకా..?
- ఏరియాలోని సమాచారం తెలియకపోతే చైన్‌మెన్‌లు ఎందుకు..? సెటిల్మెంట్‌లకా..?

-2లో



డిపిఎస్ రోడ్డులో భారీ అక్రమ షెడ్డు నిర్మాణం.. అధికారుల కనుసన్నల్లోనే..

## కాకా వెంకటస్వామి రాజకీయాల్లో లెజెండ్



హైదరాబాద్ పెన్ పవర్:కాకా వెంకటస్వామి రాజకీయాల్లో లెజెండ్ అని అన్నారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. హైదరాబాద్ లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఎడ్యుకేషనల్ ఇన్ స్టిట్యూషన్స్ లో గోల్డెన్ జూబ్లీ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఉత్తమ్. కాకా జాతీయ రాజకీయాల్లో కీలకంగా వ్యవహరించారని చెప్పారు. వెంకటస్వామి చేయని పదవి లేదు.. రాష్ట్ర మంత్రిగా, కేంద్రమంత్రిగా సేవలందించారని అన్నారు. దివంగత

-3లో

## సర్వే నెంబర్ 227లో.. దారుణ హత్య..

### బహదూర్‌పల్లి సాయినాథ్ సొసైటీ కమ్మ సంఘం సమీపంలోని 4వ వీధిలో ఘటన..

- మృతుడు సందీప్‌ను పథకం ప్రకారమే ఊరునుండి రప్పించి హత్యా చశారా..? లేక గొడవే కారణమా..?
- తోడ పుట్టిన సోదరున్ని తలపై సుత్తితో కొట్టి చంపిన దారుణ ఘటనతో స్థానికంగా భయాందోళన..
- శనివారం రాత్రి 10:00 గంటలకు హత్య జరిగినట్లు దుండిగల్ పోలీసులకి ఫిర్యాదు..
- భూమి గురించి చర్చించాలని మరో వ్యక్తితో పిలిపించి.. మద్యం తాగించి హత్య..



-3లో

# పర్మిషన్‌లు “గోప్యంగా” పెట్టి..! ‘పైసా’వసూల్..?



బౌరంపేట్‌లో మరో అక్రమ కమర్షియల్ షెడ్లు.. చైన్‌మెన్ అండతో..



కట్టడాలను జల్లెడపట్టే చైన్‌మెన్‌ల నటనకి..! ఆస్కార్



బౌరంపేట్ అక్రమ సెల్లార్‌తో అదనపు అంతస్తులు.. నిర్మాణ అనుమతులు గోప్యం..

## బౌరంపేట్ “ఎస్ఆర్‌కే”లో.. రెసిడెన్షియల్ పర్మిషన్‌తో కమర్షియల్ కట్టడం..

దుండిగల్ టౌన్‌ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యం, కరెప్షన్ ఏమేరకు ఉందో చూడండి.. దుండిగల్ మున్సిపల్ పరిధి బౌరంపేట్ నుండి మల్లంపేట్ వైపు వెళ్ళే 100 ఫీట్ల రహదారిలోని “ఎస్ఆర్‌కే” కమాన్ పక్కనే ఓ భారీ అక్రమ నిర్మాణానికి అధికారులు బరితెగించి సహకరిస్తున్నారు.. ఎస్ఆర్‌కే విల్లాల కమాన్ వద్ద ఉన్న సదరు భారీ అక్రమ నిర్మాణ అనుమతులపై నోరుమెదపని టిపిఎస్ సంజునా, చైన్‌మెన్ వేణుదముడుపులకే ప్రాధాన్యత ఇస్తున్నట్లు స్పష్టమవుతుంది..! నిబంధనలు తుంగలోతొక్కి.. ప్రమాదకర కట్టడానికి పునాది వేస్తున్నారు.. మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ, టౌన్‌ప్లానింగ్ అధికారిని సంజునా, ఏరియా చైన్‌మెన్ వేణును బిల్డింగ్ వివరాలను చెప్పమని ఫోన్ చేసినా..! వాట్సప్‌లో మెస్సేజ్ పెట్టినా స్పందించడం లేరు.. “సెల్లార్‌తో” పాటు ఐదంస్తులు నిర్మిస్తున్న భవన నిర్మాణం సుమారు 800 గజాల్లో ఉంటుందని స్థానికులు ఆరోపిస్తున్నారు.. సంబంధిత నిర్మాణానికి సుమారు 12-14 ఫీట్లవరకు సెట్‌బ్యాకులు ఉండాలి..! కానీ సెట్‌బ్యాకులు లేవని, మరోవైపు రెసిడెన్షియల్ పర్మిషన్ తీసుకుని కమర్షియల్ కట్టడంతో 100 ఫీట్ల రోడ్డు ఎఫెక్ట్‌లో ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు..

టిపిఎస్ సంజునా దుండిగల్ మున్సిపల్‌తో పాటు గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో ఇంచార్జ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.. ఈ సాకుతో బిజీగా ఉన్నట్లు చెపుతూ.. అక్రమ నిర్మాణాలకు బహిరంగంగానే సహకరించడం గమనార్హం.. ఔట్ సోర్సింగ్ పేరుతో టౌన్‌ప్లానింగ్ సిబ్బంది (చైన్‌మెన్)ని నియమించి చైన్‌మెన్‌లతో వసూళ్ళకు పాల్పడుతూ అక్రమ కట్టడాలను ప్రోత్సహిస్తున్నారు..

- మొదటి పేజి తరువాయి

మేడ్చల్ జిల్లా (ఏసిఎల్‌బి) లోకల్‌బాడీ అదనపు కలెక్టర్ మున్సిపాలిటీలపై దృష్టి సారించడం లేదని..! దుండిగల్ మున్సిపాలిటీలో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న ఈ అక్రమ కట్టడాలతో తేటతెల్లం అవుతుంది.. మరోవైపు అక్రమ నిర్మాణాలపై టౌన్‌ప్లానింగ్ అధికారుల వసూళ్ళకు “సిఫార్సులు” అనే స్టాంప్ ఒకటి సిద్దం చేసుకుని ఉండటం పరిపాటిగా మారింది.. ఒకవిధంగా చెప్పాలంటే టౌన్‌ప్లానింగ్ అధికారుల బరితెగింపు విధులుగా చెప్పవచ్చు.. దుండిగల్ మున్సిపాలిటీలో నిర్మాణ అనుమతులతో అవసరం లేదు..! నిబంధనలతో అసలు పనేలేదు..! తాంబూలం సమర్పించుకుంటే అంతా సక్రమమే..! ఏరియాల్లో నిత్యం అక్రమ అవార్డులు ఇచ్చినా తక్కువే అవుతుంది.. ఫిర్యాదులు వస్తే ఏమి తెలియనట్లు వ్యవహరిస్తారు.. పర్మిషన్ కాపి ఇవ్వమని అడిగితే టిపిఎస్‌ను అడగమని సమాధానం ఇస్తారు.. సరేలే అని సంబంధిత టౌన్‌ప్లానింగ్ అధికారి సంజునాతో ఫోన్‌లో మాట్లాడటానికి ప్రయత్నిస్తే నెలల తరబడి ఫోన్‌లు ఎత్తరు సమాధానం చెప్పరు.. మేడ్చల్ జిల్లా ఏసిఎల్‌బికి ఎక్స్‌లో ఫిర్యాదు చేసినా ప్రయోజనం శూన్యం..

## చైన్‌మెన్ వేణుకి తెలిసే అక్రమ షెడ్ల నిర్మాణాలు..

చైన్‌మెన్ చేతిలో బౌరంపేట్ ఉంది అనడంలో అతిశయోక్తి కాదు.. అక్రమ నిర్మాణం ఏదైనా ముందుగా తెలిసేది చైన్‌మెన్ (టౌన్‌ప్లానింగ్ ఔట్ సోర్సింగ్ సిబ్బంది) వేణుకే.. ఒక్కోసారి అధికారులకు కూడా తెలియకుండా నిర్మాణాలకు భారీ మొత్తంలో ముడుపులు దండుకుని సహకరిస్తాడని కొందరు ప్రజాప్రతినిధులు, నాయకులు, ఆరోపణలు ఉన్నాయి.. డిపియస్ రోడ్డులో ఓ భారీ నిర్మాణానికి, మరోచోట కమర్షియల్ షెట్టర్లతో నిర్మించిన అక్రమ షెడ్డుకు చైన్‌మెన్ వేణు అండ ఉన్నట్లు సమాచారం..

అయితే ఫిర్యాదులు అందినా..! పత్రికల్లో వచ్చినా టౌన్‌ప్లానింగ్ అధికారి సంజునా కూడా స్పందించక పోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.. చైన్‌మెన్ వెనుక అండగా టిపిఎస్ ఉన్నట్లు చర్యలు లేని అక్రమ కట్టడాలు నిదర్శనం అంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు.. అనుమతులు ఉన్నా అక్రమమే.. లేకపోయినా అక్రమమే.. సెట్‌బ్యాకులు లేకుండా నిర్మించే కట్టడాలు, ప్రమాదాలు సంభవిస్తే తప్పించుకోలేని ప్రమాదకర అక్రమ నిర్మాణాలను అధికారులే ప్రోత్సహిస్తున్నారు.. సదరు ప్రమాదకర అక్రమ కట్టడాలపై దుండిగల్ మున్సిపల్ కమిషనర్ కల్వకుంట్ల సత్యనారాయణ స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు..

# అల్లు అర్జున్ ప్రెస్ మీట్ పై మండిపడ్డ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలుగువాడి సత్తా చాటడమంటే ప్రాణాలు పోయినా పట్టించుకోకపోవడమా అంటూ అల్లు అర్జున్ పై కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ తీవ్రంగా మండిపడ్డారు. అల్లు అర్జున్ ప్రెస్ మీట్ పెడుతున్నారని తెలిసి పశ్చాత్తాపం ప్రకటిస్తారని అనుకున్నామని చెప్పారు. అయితే, హీరో తీరు మాత్రం సరిగాలేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో మాట్లాడుతూ.. ఎవరు తప్పు చేసినా సరే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ప్రజలకు ధైర్యం చెప్పారన్నారు.దీనిపై ప్రెస్ మీట్ పెట్టాల్సిన అవసరం

అల్లు అర్జున్ కు ఏమొచ్చిందని బల్మూరి వెంకట్ ప్రశ్నించారు. ప్రెస్ మీట్ లో అల్లు అర్జున్ చేసిన వ్యాఖ్యలను ఎమ్మెల్సీ తప్పుబట్టారు. సంధ్య థియేటర్ వద్ద విషాదం చోటుచేసుకున్న విషాదం తర్వాత హీరో ఎంతసేపు ఉన్నాడు, లోపల ఆయన ఉన్న ఫుటేజీ, థియేటర్ నుంచి ఎలా బయటకు వెళ్లాడనే దానికి సంబంధించి వీడియోలు ఉన్నాయని చెప్పారు.

రేవతి మరణించిన మరుసటి రోజు అల్లు అర్జున్ ఇంటి వద్ద టపాసులు కాల్చారని ఎమ్మెల్సీ చెప్పారు. ఇప్పటికైనా అల్లు అర్జున్ ఆత్మ పరిశీలన చేసుకోవాలని బల్మూరి వెంకట్ సూచించారు. రేవతి మృతికి సానుభూతి ప్రకటించి, బాధిత కుటుంబానికి అండగా ఉండాలని హితవు పలికారు.

# సర్వే నెంబర్ 227లో..దారుణ హత్య..

## బహుదూర్‌పల్లి సాయినాథ్ సొసైటీ కమ్మ సంఘం సమీపంలోని 4వ వీధిలో ఘటన..

**మృతుడు సందీప్‌ను పథకం ప్రకారమే ఊరునుండి రప్పించి హత్యా చశారా..? లేక గొడవే కారణమా..?**

**తోడ పుట్టిన సోదరున్ని తలపై సుత్తితో కొట్టి చంపిన దారుణ ఘటనతో స్థానికంగా భయాందోళన..**

**శనివారం రాత్రి 10:00 గంటలకు హత్య జరిగినట్లు దుండిగల్ పోలీసులకి ఫిర్యాదు..**

**భూమి గురించి చర్చించాలని మరో వ్యక్తితో పిలిపించి.. మద్యం తాగించి హత్య..**

**దుండిగల్, పెన్ పవర్,డిసెంబర్ 22:** మానవత్వం మంట కలిసింది..మాటా మాటా పెరిగి తోడ పుట్టిన సొంత సోదరున్నే హతమార్చిన దారుణ ఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దుండిగల్ మండలం దొమ్మర పోచంపల్లికి చెందిన లింగంగౌడ్ పోలీసులకు శనివారం రాత్రి 11:00 గంటలకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.. మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం రాయిలాపూర్ గ్రామానికి చెందిన మన్నె శేఖర్ అనే వ్యక్తి తనకు (లింగం గౌడ్‌కి) ఫోన్ చేసి మీ బావమరిది సంతోష్, సొంత తమ్ముడు సందీప్‌ను సుత్తితో తల పగులగొట్టగా సందీప్ అక్కడికక్కడే మృతిచెంది రక్తపు మడుగులో ఉన్నట్టు మన్నె శేఖర్ చెప్పాడని ఆశా లింగంగౌడ్ పోలీసులకి వివరించాడు.. అయితే తన బంధువు బెండి వీరేష్ అనే వ్యక్తితో కలిసి లింగంగౌడ్ బహుదూర్‌పల్లి సర్వే నెంబర్ 227లోని సాయినాథ్ సొసైటీలో ఉన్న కమ్మ సంఘం సమీపంలో రక్తపు మడుగులో ఉన్నది గమనించిన లింగంగౌడ్.. వెంటనే సమాచారం ఇచ్చిన మన్నె శేఖర్‌కి ఫోన్ చేసి అసలు విషయం తెలుసు కొనుటకు, ఫిర్యాదు దారుడు లింగంగౌడ్, మన్నె శేఖర్‌కి ఫోన్ చేశాడు.. దీంతో శేఖర్ గత రెండు రోజులుగా మృతుని సోదరుడు సంతోష్ తన భూమిగురించి చర్చించడానికి హైదరాబాద్‌కి తీసుకు రావాల్సిందిగా కోరాడని.. శనివారం 09:00 గంటలకు కూడా ఫోన్ చేసి తన తమ్ముడిని హైదరాబాద్‌కి తీసుకురమ్మని మరోసారి కోరడంతో..! మన్నె శేఖర్ తన ఆటోలో శనివారం సాయంత్రం 4:00 గంటల సమయంలో సందీప్‌ను కౌడిపల్లి మండలం రాయిపూర్ గ్రామం నుండి బహుదూర్‌పల్లి, సర్వే నెంబర్ 227లోని సాయినాథ్ సొసైటీకి తీసుకొచ్చినట్లు మన్నె శేఖర్ చెప్పాడని ఫిర్యాదు దారుడు లింగంగౌడ్ దుండిగల్ పోలీసులకి వివరించాడు.. అయితే బహదూర్‌పల్లి లోని కమ్మ సంఘం సమీపంలో రోడ్డుపై బీర్లు తాగుతున్నారని చెప్పారు.. ఆ సమయంలో ఇరువురి నడుమ, కుటుంబ విషయాలు, భూమి సమస్యల గురించి కొన్ని గొడవలు తలెత్తాయని..! అకస్మాత్తుగా సంతోష్ తన పల్సర్ బైక్ నుండి ఒక సుత్తిని తీసుకొని సందీప్ తలపై నాలుగైదు సార్లు బలంగా కొట్టడంతో సందీప్ అక్కడికక్కడే మరణించాడని..! తరువాత సంతోష్ తన బైక్‌పై పారిపోయాడని శేఖర్ చెప్పినట్లు.. ఫిర్యాదుదారుడు లింగంగౌడ్ పోలీసులకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు దుండిగల్ పోలీసులు మీడియాకు తెలిపారు..! సంతోష్ కుటుంబ భూ వివాదాల కారణంగా తన సొంత సోదరుడు సందీప్‌ను హత్య చేశాడని పేర్కొన్నాడు.. దుండిగల్ పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు..



హత్యకు గురైన సందీప్.. ఫైల్ ఫోటో..

## కాకా వెంకటస్వామి రాజకీయాల్లో లెజెండ్

- మొదటి పేజి తరువాయి

కాకా మా అందరికీ స్ఫూర్తి అని కొనియాడారు. ఎంతో మంది పేదలకు మంచి విద్య అందిస్తున్నారని తెలిపారు.

సరోజా వివేక్ పై ఉత్తమ్ ప్రశంసలు

విద్యాసంస్థలను కరస్పాండెంట్ సరోజా వివేక్ సరోజా సక్సెస్ ఫుల్ గా రన్ చేస్తున్నారని ఉత్తమ్ అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం మంచి పరిణామం అని చెప్పారు. లాభాపేక్ష లేకుండా విద్య అందించడం చాలా అరుదన్నారు. విద్యా సంస్థలకు ఎలాంటి సాయం కావాలన్న చేస్తామని చెప్పారు. ఎడ్యుకేషన్ బలపరచడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలను బలపరిచేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గత ప్రభుత్వం పదేళ్లలో ఒక్క టీచర్ ను రిక్రూట్ చేయలేదు.. తాము వచ్చాక 11 వేల టీచర్ పోస్టులు భర్తీ చేశామని చెప్పారు ఉత్తమ్.

# రియల్ లైఫ్‌లోనూ అల్లుఅర్జున్ నటిస్తున్నట్లే ఉంది

**హైదరాబాద్ పెన్ పవర్:** అల్లు అర్జున్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతలు మండిపడుతున్నారు. రియల్ లైఫ్ లోనూ అల్లు అర్జున్ నటిస్తున్నట్లే ఉందన్నారు కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి. ఎవరో రాసిన నోట్ ను... అల్లు అర్జున్ మీడియా సమావేశంలో చదివారన్న ఎంపీ చామల...అసెంబ్లీలో సీఎం వాస్తవాలే చెప్పారన్నారు. పుష్ప2 సినిమాకు కాంగ్రెస్ సర్కార్, సీఎం రేవంత్ అండగా ఉండి రేట్లు పెంచారని గుర్తు చేశారు ఎంపీ చామల.పుష్ప 2 రిలీజ్ రోజు అల్లు అర్జున్ థియేటర్ లో ఎంత సేపు ఉన్నాడో... సీసీ ఫుటేజీ ఉందన్నారు %మీజ% బల్మూరి వెంకట్. ప్రెస్ మీట్ లో చేసిన కామెంట్స్ ను అల్లు అర్జున్ వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రేవతి చనిపోయిన మరుసటి రోజు అల్లు అర్జున్ తన ఇంటి దగ్గర టపాసులు కాల్చారని ఆరోపించారు బల్మూరి. అల్లు అర్జున్ ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు.



పుష్ప2 బెనిఫిట్ షో సందర్భంగా తను రోడ్ షో చేసినట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అది రోడ్ షో కాదని అల్లు అర్జున్ అన్న సంగతి తెలిసిందే. సంధ్య థియేటర్ కు దగ్గర్లో కారు ఆగిపోయిందని.. తన కోసం వచ్చిన అందరి కోసం ఒక గెస్చర్ ఇచ్చానని తెలిపారు. అంతమంది వచ్చినపుడు నేను లోపల దాక్కుంటే వాళ్లకు నేను ఏమిచ్చినట్లు.. అందుకోసమే తాను బయటికొచ్చి చేతులు ఊపుతూ ముందుకు వెళ్లినట్లు చెప్పారు... ప్యాన్స్ కు తాను చెబితేనే వెళ్తారని పోలీసులు కూడా చెప్పడంతో బయటకి రావడం జరిగిందన్నారు. బాధ్యతగా అందరినీ ముందుకు వెళ్లాలని పోలీసులు చెప్పినట్లు తెలిపారు.

# ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే రీల్స్ కట్ చేస్తాం: పుష్ప 2 ఘటనపై ఏసీపీ ఫైర్



**హైదరాబాద్ పెన్ పవర్:** పుష్ప 2 ప్రీమియర్ షో సందర్భంగా ఆర్టీసీ క్రాస్ రోడ్ లోని సంధ్య థియేటర్ దగ్గర జరిగిన తొక్కిసలాట ఘటన తెలంగాణ స్టేట్ లో హాట్ టాపిక్ మారింది. ఈ ఘటనపై అసెంబ్లీ సాక్షిగా స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి.. హీరో అల్లు అర్జున్ తీరుపై విమర్శలు గుప్పించారు. సీఎం వ్యాఖ్యలకు వెంటనే కౌంటర్ గా అల్లు అర్జున్ ప్రెస్ మీట్ నిర్వహించి తనపై చేసినవన్నీ తప్పుడు ఆరోపణలే అని రీ కౌంటర్ ఇవ్వడంతో పుష్ప తొక్కిసలాట ఇష్యూ ఇటు సినీ, అటు పొలిటికల్ సర్కిల్స్ లో చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో హీరో అల్లు అర్జున్ వ్యవహారం, పుష్ప -2 సినిమా విడుదల, తదనంతర పరిణామాలపై ఏసీపీ విష్ణుమూర్తి కీలక వ్యాఖ్యలు చేశారు.

2024, డిసెంబర్ 22న హైదరాబాద్ సోమాజీగూడ ప్రెస్ క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో అల్లు అర్జున్ ఓ రిమాండ్ ఖైదీ.. కేసు విచారణ కోర్టులో ఉండగా ముద్దాయి ప్రెస్ మీట్ పెట్టొచ్చా అని ప్రశ్నించారు. సంధ్య థియేటర్ దగ్గర గ్యాదరింగ్ వద్దని పోలీసులు చెప్పిన అల్లు అర్జున్ వినలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అల్లు అర్జున్ బాధ్యత గల పౌరుడిగా ప్రవర్తించలేదని విమర్శించారు. సంధ్య థియేటర్ వద్ద అల్లు అర్జున్ బౌన్సర్ల తోపులాటతోనే మహిళా చనిపోయిందని ఆరోపించారు. బౌన్సర్లతో దౌర్జన్యం కరెక్ట్ కాదని.. పబ్లిక్ ప్లేసులలో సెలెబ్రెటీలు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. పోలీసులు తమ డ్యూటీలు సరిగ్గానే నిర్వహించారని.. పోలీసులంటే కనీస గౌరవం లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. పోలీసులను అవమానపర్చటం సరికాదని హితవు పలికారు. పోలీసులపై తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని.. అధికారులను ఇష్టం వచ్చినట్లు తిడితే రీల్స్ కట్ చేస్తామని ఘాటు వార్నింగ్ ఇచ్చారు. చేసిన తప్పు కప్పి పుచ్చుకోవడానికే పోలీసులపై నిందలు వేస్తున్నారని ఆరోపించారు. వాపును చూసి బలమని మురిసిపోవద్దని అన్నారు. సినిమాల్లో కూడా పోలీసులను అమానించడం మానుకోవాలని.. ఇష్టానుసారం ప్రవర్తిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్వీట్ వార్నింగ్ ఇచ్చారు. దొంగతనాలపై సినిమా తీసి ప్రజలకు ఏం సందేశం ఇస్త్నురని సూటిగా ప్రశ్నించారు. మీరేమైనా దేశ ప్రతిష్టను పెంచేలా మూవీలు తీస్తున్నారా అని నిలదీశారు. దొంగలు, రౌడీలు, స్మగ్లర్లలా కాకుండా.. సందేశాత్మక సినిమాలు తీస్తే ప్రోత్సాహిస్తామని అన్నారు.

## హైదరాబాద్ ట్రాఫిక్ విధుల్లోకి ట్రాన్స్‌జెండర్లు



**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్‌లో ట్రాన్స్‌జెండర్లు ట్రాఫిక్ విధులు నిర్వర్తించనున్నారు. రేపటి(సోమవారం, డిసెంబర్ 23) నుంచే వీరు విధుల్లోకి ఎక్కనున్నారు. ఈ మేరకు నగర కమిషనర్ సీవీ ఆనంద్ ప్రకటన చేశారు. 39 మంది ట్రాన్స్‌జెండర్లు ట్రాఫిక్ అసిస్టెంట్‌లుగా నియమితులైన ట్లు సీవీ ఆనంద్ తెలిపారు. వీరికి 15 రోజుల పాటు శిక్షణ ఇచ్చినట్లు సీపీ వెల్లడించారు. శిక్షణ పూర్తి చేసుకు న్న వారికి బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్‌లో సీవీ ఆనంద్ డెమో నిర్వహించారు. వీరంతా హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో పని చేయనున్నారు.

## పబ్లిక్‌ను టచ్ చేస్తే తాట తీస్తాం: బౌన్సర్లకు సీపీ ఆనంద్ వార్నింగ్



**హైదరాబాద్ పెన్ పవర్:**సెలబ్రెటీలకు కాపలాగా ఉండే ప్రైవేట్ సెక్యూరిటీ బౌన్సర్లకు హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. పుష్ప 2 ప్రీమియర్ షో సందర్భంగా సంధ్య థియేటర్ దగ్గర తొక్కిసలాట ఘటనపై 2024, డిసెంబర్ 22న సీపీ సీవీ ఆనంద్ మినిట్ టూ మినిట్ వీడియో రిలీజ్ చేసి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విధుల్లో ఉన్న పోలీస్ ఆఫీసర్లను తోసేసిన, వారిపై చెయ్యి వేసినా వదిలిపెట్టే ప్రసక్తి లేదని.. అలాగే పబ్లిక్‌ను పక్కకు తోసేసినా తాట తీస్తామని స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.

బౌన్సర్‌లను సప్లై చేసే ఏజెన్సీలకు కూడా వార్నింగ్ ఇస్తున్నా.. ఏదైనా ఇష్యూ జరిగితే బౌన్సర్‌ల బాధ్యత ఆ ఏజెన్సీస్‌తో పాటు బౌన్సర్లను నియమించుకున్న వీఐపీపైన కూడా ఉంటుందని స్పష్టం చేశారు. బౌన్సర్‌ల విషయంలో చాలా సీరియస్‌గా వెళ్తామని.. మాకు లా అండ్ ఆర్డర్ ముఖ్యమని అన్నారు. కాగా, పుష్ప 2 ప్రీమియర్ షో సందర్భంగా సంధ్య థియేటర్ దగ్గర అల్లు అర్జున్ బౌన్సర్లు పబ్లిక్ ను పక్కకు తోసేయడంతో తొక్కిసలాట జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో ఓ మహిళా మృతి చెందగా.. ఆమె కుమారుడు తీవ్రంగా గాయపడి ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందున్నాడు. ఈ నేపథ్యంలోనే బౌన్సర్లకు సీపీ మాస్ వార్నింగ్ ఇచ్చారు.

# కాకా చొరవతోనే కార్మికులకు పెన్షన్ స్కీం అమలవుతుంది



**హైదరాబాద్ పెన్ పవర్:**మంచిర్యాల జిల్లా చెన్నూరు నియోజకవర్గం ఎమ్మెల్యే కార్యాలయంలో మాజీ కేంద్రమంత్రి కాకా వెంకటస్వామి 10 వ వర్ధంతి కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నిర్వహించారు. కాకా వెంకటస్వామి చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. కాకా వెంకటస్వామి బడుగు.. బలహీన వర్గాలకు చేసిన సేవలను కాకా అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తలు కొనియాడారు. బడుగు బలహీన వర్గాలకు చేసిన సేవా కార్యక్రమాలు కాకా వెంకటస్వామికే దక్కుతాయన్నారు. మాజీ కేంద్రమంత్రి కాకా వెంకటస్వామి చొరవతోనే కార్మికులకు పెన్షన్ స్కీం ను ప్రవేశ పెట్టిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. పేదలకు.. బలహీన వర్గాల కుటుంబాలకు గుడిసెలు ఇప్పించి.. తన ఇంటి పేరునే గుడిసెల వెంకటస్వామిగా మార్చుకున్నారని తెలిపారు.

పెద్దపల్లి జిల్లా రామగుండం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మాజీ కేంద్రమంత్రి గడ్డం వెంకటస్వామి 10వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మేయర్ అనిల్ కుమార్, , కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు, నాయకులు, కాకా అభిమానులు పాల్గొన్నారు. కాకా తన రాజకీయ జీవితంలో మచ్చలేని గొప్ప నాయకుడన్నారు. సింగరేణి సంస్థ మనుగడ కోసం కేంద్ర మాజీ మంత్రి.. దివంగత నేత కాకా వెంకటస్వామి సేవలు మరువలేనివని మేయర్ అనిల్ కుమార్ అన్నారు.

**బెల్లంపల్లిలో...**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కేంద్రమాజీమంత్రి .. దివంగత నేత కాకా వెంకటస్వామి 10వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నిరుపేదలకు దుప్పట్లు పంచి బెట్టారు.స్థానిక అండేద్కర్ చౌరస్తాలో కూలీలకు అల్పాహారం అందజేశారు.

**జగిత్యాల నియోజకవర్గం కోరుట్లలో...**

జగిత్యాల జిల్లా కోరుట్ల నియోజకవర్గంలో కేంద్ర మాజీ మంత్రి.. కాకా వెంకటస్వామి వర్ధంతి వేడుకలు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ నర్సింగరావు, కృష్ణారావు ఆధ్వర్యంలో జరిగాయి. కాకా చిత్రపటానికి కాంగ్రెస్ కార్యకర్తలు పూలమాల వేసి నివాళులు అర్పించారు. కాకా.. బడుగు.. బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేశారన్నారు. ప్రస్తుతం ఆయన కుటుంబం కూడా కాకా ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని బలహీన వర్గాల కోసం పని చేస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడేందుకు కీలక పాత్ర పోషించిన మహోన్నత వ్యక్తి కాకా అని తెలిపిన జువ్వాడి నర్సింగరావు అన్నారు.

# నాడు జగన్ రాంగ్ - నేడు రేవంత రైట్ ...అదెలా డ్యూడ్?

**హైదరాబాద్ పెన్ పవర్:** ఎక్కడైనా తొక్కిసలాట జరిగితే అందుకు బాధ్యులను చేస్తూ కేసులు నమోదు చేయడం సర్వసాధారణం. . కానీ ఆంధ్రప్రదేశ్ లో జరిగిన తొక్కిసలాట ఘటనకు, హైదరాబాద్ లో జరిగిన సంధ్యా థియేటర్ లో జరిగిన తొక్కిసలాటకు మధ్య పొంతన పెడుతూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. నాడు ముఖ్యమంత్రి జగన్ తీసుకున్న నిర్ణయాలను తప్పు పట్టిన వారు, ఇప్పుడు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయాలను స్వాగతిస్తుండటం ఏంటని ప్రశ్నిస్తున్నారు. రెండు ఘటన ఫొటోలు పెట్టి సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్నారు. ఒక ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే ఒక న్యాయం.. మరొక ప్రభుత్వం తీసుకుంటే మరొకరకమైన అభిప్రాయమా? అని ప్రశ్నిస్తున్నారు.




**కందుకూరు ఘటనపై..**

ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా కందుకూరులోతెలుగుదేశం పార్టీ ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమం ఎన్నికలకు ముందు చేపట్టింది ఈ కార్యక్రమానికి అప్పటి టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. అయితే కందుకూరులో జరిగిన తొక్కిసలాటలో ఎనిమిది మంది వరకూ మరణించారు. అనేక మందికి గాయాలయ్యాయి. అయితే అదే సమయంలో టీడీపీ మరణించిన కుటుంబాలకు పరిహారం పార్టీ తరుపున అందించింది. ప్రభుత్వం కూడా కొంత సాయం చేసింది. ఇరుకు సందులో ఏర్పాటు చేయడం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని, పోలీసుల అనుమతి తీసుకోకుండా అప్పట్లో నిర్వాహకులు సభను ఏర్పాటు చేశారన్న వార్తలు వచ్చాయి. ఇక గుంటూరులో టీడీపీ నిర్వహించిన కార్యక్రమంలో ముగ్గురు మరణించారు. ఉయ్యూరు ఫౌండేషన్ పేదలకు కానుకలను పంపిణీ చేయడంలో భాగంగా తొక్కిసలాట జరిగి మహిళలు మరణించారు. కందుకూరులో జరిగిన సంఘటనపై అప్పటి జగన్ ప్రభుత్వం శేషశయనారెడ్డి కమిషన్ వేసింది. విచారణ చేపట్టింది. కేసులు నమోదు చేసింది.

**ఇరుకు సందుల్లో...**

అయితే ఇరుకుసందుల్లో సభలను ఏర్పాటు చేయడంపై పోలీసులు అభ్యంతరం తెలిపారు. దీనికి ప్రభుత్వం ప్రత్యేకంగా ఉత్తర్వులు కూడా జారీ చేసింది. అయితే నాడు అలా బహిరంగ సభలకు అనుమతి ఇవ్వకపోవడంపై జగన్ ప్రభుత్వం పై విమర్శలు వెల్లువెత్తాయి. కానీ ఇప్పుడు అదే జరిగింది. నాడు తొక్కిసలాటలో రాజకీయ నాయకులు కారణమైతే. ఇప్పుడు హైదరాబాద్ లో జరిగిన తొక్కిసలాటకు కారణం సినీ హీరో. ఎవరైనా ఒకటే. అక్కడా ప్రాణాలే.. ఇక్కడా ప్రాణాలే. కానీ రేవంత్ రెడ్డి బెన్ ఫిట్ షోలు రద్దు, ధరలను పెంచబోమంటూ తీసుకున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయాన్ని సోషల్ మీడియాలో అనేక మంది స్వాగతిస్తున్నారు. కానీ అప్పుడు ఏపీలో జగన్ ప్రభుత్వం చేసింది కూడా అదే కదా? అన్న ప్రశ్న తలెత్తుతుంది. ఎన్నికల సందర్భంగా ప్రచార సభలను ఇరుకు సందుల్లో కూడా బహిరంగ ప్రదేశాల్లో నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేయడాన్ని తప్పుపడుతూ అప్పట్లో అనేక మంది పోస్టులు పెట్టారు. ఇప్పుడు వారే రేవంత్ రెడ్డి నిర్ణయాన్ని సమర్థిస్తున్నారు. రెండింటికీ తేడా ఏంటో? మరి రాష్ట్రం మారిందా? ప్రభుత్వాలు మారాయా? అంటూ కామెంట్స్ నెట్టింట జోరుగా కనిపిస్తున్నాయి.

# అల్లు అర్జున్ పై కమలం కటాక్ష వీక్షణాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** సినీ హీరోల మీద రాజకీయ పార్టీలకు ఎపుడూ ప్రత్యేక ఆకర్షణలు ఉంటాయి. ఎందుకంటే వారు క్రౌడ్ పుల్లర్స్. అందుకే వారి సహాయాని తీసుకుంటూ ఉంటారు. మరీ ముఖ్యంగా దక్షిణాదిన తమిళనాడు తెలుగు రాష్ట్రాల్లో సినీ అభిమానం ప్రత్యేకమైనది. చొక్కాలు చింపుకోవడమే కాదు, ప్రాణాలను సైతం ఇచ్చేసేటంత అభిమానం ఉంటుంది.ఇదిలా ఉంటే టాలీవుడ్ హీరో అల్లు అర్జున్ ప్రస్తుతం వివాదాల్లో చిక్కుకుని ఇబ్బందుల పాలు అవుతున్నారు. ఆయన మీద ఏ 11 అంటూ కేసు కట్టి పోలీసులు ఒక రాత్రి జైలుకు పంపించారు. ప్రస్తుతం బెయిల్ మీద ఆయన ఉన్నారు. నెమ్మదిగా ఈ కేసు తేలిక అవుతుందని అంతా అనుకుంటే మరింత బిర్ర బిగుసుకుంటోంది. అంతే కాదు ఏకంగా తెలంగాణా ప్రభుత్వం ఈ కేసు విషయంలో ఎంతటి సీరియస్ గా ఉందో అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రకటన కూడా స్పష్టం చెబుతోంది.



మరో వైపు ఈ కేసు విషయంలో అల్లు అర్జున్ బెయిల్ రద్దు చేయాలని సుప్రీం కోర్టు దాకా తెలంగాణా పోలీసులు వెళ్లారు. ఇవన్నీ ఒక వైపు ఉంటే అల్లు అర్జున్ తప్పు ఈ విషయంలో ఎంత అన్నది కూడా చర్చ సాగుతోంది. ఆయన హీరోగా థియేటర్ కి వెళ్ళి సినిమా చూడడం తప్పు కాదు కానీ హెవీ క్రౌడ్ ఉన్నపుడు వెళ్ళడం తప్పే అని అంటున్న వారూ ఉన్నారు. ఏది ఏమైనా ఈ కేసు విషయంలో ఏ 11 గా ఉన్న అల్లు అర్జున్ ని అరెస్ట్ చేయడం మీద భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసేవారూ ఉన్నారు.మరో వైపు ఇదే కేసు విషయంలో రాజకీయ పార్టీలు ఎవరికి తోచిన విధంగా వారు స్పందిస్తున్నారు. కాంగ్రెస్ కి వ్యతిరేకంగా ఉండే విపక్షం ప్రభుత్వానిదే తప్పు అంటోంది. బీఆర్ఎస్ అయితే జనాలను కంట్రోల్ చేయలేకపోయారు అని ప్రభుత్వాన్ని నిందిస్తోంది. ఇక తెలంగాణా బీజేపీ అధ్యక్షుడు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కూడా అల్లు అర్జున్ అరెస్ట్ ని తప్పు పట్టారు.

కేంద్ర బీజేపీ మంత్రి అశ్విన్ వైష్ణవ్ వంటి వారు కూడా కాంగ్రెస్ ప్రభుత్వానిదే ఆ ఘటన బాధ్యత అని అల్లు అర్జుని అరెస్ట్ చేయడం తప్పే అన్నారు. ఇక ఏపీలో వైసీపీ అల్లు అర్జున్ కి మద్దతుగా నిలిచింది. ఏపీ బీజేపీ కూడా అల్లు అర్జున్ అరెస్ట్ తప్పు అంటోంది. ఈ విషయంలో ఇప్పటికి రెండు సార్లు దగ్గుబాటి పురంధేశ్వరి తెలంగాణా ప్రభుత్వం తీరుని తప్పు పట్టారు. తాజాగా ఆమె మాట్లాడుతూ ఏ 11గా ఉన్న అల్లు అర్జున్ ని అరెస్ట్ చేయడంతో ఉత్సాహం ఏంటని ప్రశ్నించారు. మిగిలిన వారిని అరెస్ట్ చేసి విచారించకుండా ఆయన ఒక్కరినే ఎందుకు అరెస్ట్ చేశారని నిలదీశారు.అది యాధృచ్చికంగా జరిగిన ఘటన తప్ప అందులో హీరో అర్జున్ తప్పు లేదని ఆమె అంటున్నారు. ఒక హీరోగా అల్లు అర్జున్ ఆ థియేటర్ కి వెళ్ళారని చెబుతున్నారు. ఆయన ఏదో కావాలని తొక్కిసలాటకు కారణం అయినట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం చిత్రీకరిస్తోందని ఆమె ఘాటు వ్యాఖ్యలు చేశారుఈ విధంగా చూస్తే అల్లు అర్జున్ కి కేంద్రంలో అధికారంలో ఉన్న జాతీయ పార్టీ బీజేపీ మద్దతు నిండుగా దక్కుతోంది. అసెంబ్లీలో రేవంత్ రెడ్డి ప్రసంగం తర్వాత ఏ రాజకీయ పార్టీ అల్లు అర్జున్ ని సమర్థించేందుకు ఇప్పటిదాకా ముందుకు రాలేదు. ఈ నేపథ్యంలో ఏపీ నుంచి చిన్నమ్మ సపోర్ట్ చేయడం పట్ల చర్చ సాగుతోంది.మరో వైపు పుష్ప వన్ టూ ఈ రెండు సినిమాలతో పాన్ ఇండియా స్టార్ గా మారిన అల్లు అర్జున్ విషయంలో బీజేపీ జాతీయ నాయకత్వం కూడా సాఫ్ట్ కార్నర్ తో ఉందని అంటున్నారు. అల్లు అర్జున్ పుష్ప 2 హిందీలో బ్లాక్ బస్టర్ హిట్ అయింది. దాంతో ఆయన జాతీయ కథానాయకుడిగా ఎస్టాబ్లిష్ అయ్యారు. ఈ నేపథ్యంలో బీజేపీ కరుణ కటాక్ష వీక్షణాలు ఆయన మీద కురిపించడం మీద అయితే రాజకీయంగా కొత్త చర్చకు దారి తీస్తోంది.

## సినీ ప్రముఖుల ఇళ్లపై దాడిని ఖండిస్తున్నా: సీఎం రేవంత్

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రముఖ నటుడు అల్లు అర్జున్ నివాసంపై ఆదివారం (డిసెంబర్ 22) దాడి జరిగిన విషయం తెలిసిందే. సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో మృతి చెందిన రేవతి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ బన్నీ ఇంటి ముందు ఆందోళనకు దిగిన ఓయూ జేఏసీ నేతలు.. అల్లు అర్జున్ నివాసంపై రాళ్లు, టమాటాలతో దాడి చేసి ఇంట్లోని పూల కుండీలను ధ్వంసం చేశారు. ఈ క్రమంలో అల్లు అర్జున్ ఇంటిపై దాడిని ఖండిస్తూ సోషల్ మీడియా వేదికగా సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. "సినీ ప్రముఖుల ఇళ్లపై దాడి ఘటనను ఖండిస్తున్నాను. శాంతి భద్రతల విషయంలో కఠినంగా వ్యవహరించాల్సిందిగా రాష్ట్ర డీజీపీ, నగర పోలీసు కమిషనర్‌ను ఆదేశిస్తున్నా. ఈ విషయంలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదు. సంధ్య థియేటర్ ఘటనతో సంబంధం లేని పోలీసు సిబ్బంది స్పందించకుండా ఉన్నతాధికారులు జాగ్రత్తలు తీసుకోవాలి" అని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అల్లు అర్జున్ అరెస్ట్‌పై ఏసీపీ విష్ణుమూర్తి ఆదివారం (డిసెంబర్ 22) ప్రెస్ మీట్ నిర్వహించి ఘాటు వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. విష్ణుమూర్తి కామెంట్స్ పై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసుతో సంబంధం లేదని పోలీసులు ఈ అంశంపై మాట్లాడకుండా ఆదేశించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు.

## సంక్రాంతి సినిమాల పరిస్థితేంటి?



హైదరాబాద్ పెన్ పవర్: మొత్తానికి పుష్ప-2 గొడవ పుణ్యమా అని.. తెలుగు సినిమా పరిశ్రమకు గట్టి దెబ్బే తగిలేలా ఉంది. ఇకపై బెనిఫిట్ షోలు, అదనపు రేట్లు ఉండవని తెలంగాణ ప్రభుత్వం తేల్చి చెప్పేసింది. రేవంత్ రెడ్డి ఇంతకుముందే ఈ దిశగా సంకేతాలు ఇచ్చినప్పటికీ.. అలాంటిదేమీ ఉండదని అనుకున్నారు. కానీ బన్నీ అరెస్ట్ తర్వాత జరిగిన పరిణామాలతో ఈ వ్యవహారాన్ని రేవంత్ రెడ్డి సర్కారు చాలా సీరియస్‌గా తీసుకున్నట్లే కనిపిస్తోంది. బన్నీకి పరామర్శల పేరుతో జరిగిన ప్రహసనం.. అరెస్ట్ మీద రేవంత్ రెడ్డి మీద సోషల్ మీడియాలో జరిగిన దూషణల పర్వం ప్రభుత్వానికి ఆగ్రహం తెప్పించినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై అసెంబ్లీలో రేవంత్ రెడ్డి మాటల్ని బట్టి చూస్తే ఆయన బన్నీ మీదే కాక టాలీవుడ్ మీద యుద్ధం ప్రకటించినట్లు కనిపిస్తోంది. ఈ క్రమంలోనే తాను సీఎంగా ఉన్నంత వరకు తెలంగాణలో బెనిఫిట్ షోలు, అదనపు రేట్లు ఉండవని ప్రకటించేశారు. మంత్రి కోమటి రెడ్డి సైతం ఈ విషయాన్ని ధ్రువీకరించారు.బెనిఫిట్ షోలు, అదనపు రేట్లు రద్దు చేసే విషయం మొన్నటి దాకా ప్రతిపాదనగానే ఉంది. నిన్నటి పరిణామాలతో అది నిర్ణయంగా మారిందని స్పష్టమవుతోంది. ఈ పరిణామం సంక్రాంతి సినిమాలకు గట్టి ఎదురు దెబ్బ అనడంలో సందేహం లేదు. తెలుగు సినిమాలకు నైజాం చాలా కీలకమైన మార్కెట్. ఇక్కడ బిజినెస్ భారీ లెవెల్లో జరుగుతుంది. పెద్ద సినిమాలను చాలా ఎక్కువ రేట్లకు అమ్ముతారు. ఆ రేట్లను రికవర్ చేయాలంటే బెనిఫిట్ షోలు, అదనపు రేట్లు చాలా అవసరం. భవిష్యత్తులో ఏమైనా పరిస్థితులు మారి నిర్ణయం మారుతుందేమో కానీ.. ప్రస్తుతానికి బెనిఫిట్ షోలు, అదనపు రేట్లు కష్టమే అనిపిస్తోంది. ఇది సంక్రాంతి సినిమాలకు మింగుడు పడని విషయమే. మీడియం బడ్జెట్లో తెరకెక్కిన 'సంక్రాంతికి వస్తున్నాం' సంగతి పక్కన పెడితే.. గేమ్ చేంజర్, డాకు మహారాజ్ సినిమాలకు బెనిఫిట్ షోలు, అదనపు రేట్లు చాలా అవసరం. అవి లేవంటే బిజినెస్ మీద తీవ్ర ప్రభావం పడుతుంది. 'గేమ్ చేంజర్'ను ప్రొడ్యూస్ చేయడమే కాక.. 'డాకు మహారాజ్'ను డిస్ట్రిబ్యూట్ చేస్తున్న దిల్ రాజు ఇప్పుడు ఏం చేస్తాడన్నది చూడాలి. ఆయనకు తెలంగాణ ప్రభుత్వ పెద్దలతో మంచి సంబంధాలే ఉన్నప్పటికీ.. బెనిఫిట్ షోలు, అదనపు రేట్ల విషయంలో ప్రభుత్వం ఓ విధాన నిర్ణయం తీసుకున్నట్లు కనిపిస్తున్న నేపథ్యంలో ఆయన కోసం తగ్గుతారా అన్నది ప్రశ్న.

### మా చేతిలోనే రేవతి ప్రాణాలు కోల్పోయింది..

### 15 రోజులుగా మన:శాంతి లేదు

హైదరాబాద్ పెన్ పవర్: పుష్ప-2 ప్రీమియర్ షో సందర్భంగా సంధ్య థియేటర్ దగ్గర జరిగిన తొక్కిసలాట ఘటనపై చిక్కడపల్లి సీఐ కీలక వ్యాఖ్యలు చేశారు. తొక్కిసలాట ఘటనకు సంబంధించి ఆ రోజు జరిగిన పూర్తి వీడియోను హైదరాబాద్ పోలీసులు ఆదివారం (డిసెంబర్ 22) రిలీజ్ చేశారు. ఈ వీడియోపై హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా చిక్కడపల్లి సీఐ మాట్లాడుతూ.. 'తొక్కిసలాట జరిగిన సమయంలో అక్కడే ఉన్నా. తొక్కిసలాటలో గాయపడిన రేవతిని బ్రతికించేందుకు తీవ్రంగా శ్రమించాం. మా చేతిలోనే రేవతి ప్రాణాలు కోల్పోయింది. తొక్కి సలాట ఘటన ఇప్పటికీ మర్చిపోలేకపోతున్నా. 15 రోజులుగా మన:శాంతి లేదు" అని వ్యాఖ్యానించారు. ప్రీమియర్ షో సందర్భంగా అల్లు అర్జున్ రాక కోసం సంధ్య థియేటర్ యాజమాన్యం పర్మిషన్ కోసం వచ్చింది.. కానీ రెండు థియేటర్లకు ఒకే ఎంట్రీ, ఎగ్జిట్ గేటు ఉండటంతో అనుమతి ఇవ్వలేదని తెలిపారు. అయిన అల్లు అర్జున్ ప్రీమియర్ షో చూసేందుకు థియేటర్ కు రావడంతో తొక్కిసలాట జరిగి ఓ మహిళ మృతి చెందగా.. ఆమె కుమారుడు అపస్మారక స్థితిలోకి వెళ్లాడని చెప్పారు. తొక్కిసలాటలో మా ప్రాణాలు కూడా పోతాయనిపించిందని అన్నారు. థియేటర్ దగ్గర పరిస్థితి అదుపు తప్పిందని.. అల్లు అర్జున్ వెళ్లిపోవాలని కోరగా ఆయన నిరాకరించాడు. పై అధికారులు వచ్చి చెప్పిన తర్వాత ఆయన థియేటర్ నుండి వెళ్లిపోయాడని పేర్కొన్నారు.

# రేవంత్ డెసిషన్ కు ఫిదా అవుతున్న జనం...అదీ "దెబ్బ" అంటూ?




హైదరాబాద్ పెన్ పవర్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయంపై నెట్టింట ప్రశంసలు కనిపిస్తున్నాయి. శభాష్ రేవంత్ రెడ్డి.. అదీ దెబ్బ అంటే అని కామెంట్స్ వినపడుతున్నాయి. నిజానికి నిన్న అసెంబ్లీలో రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యల్లో తప్పేముంది? అందులో నిజాలను ఎవరు అంగీకరించినా.. అంగీకరించకపోయినా అందులో నూటికి నూరుపాళ్లు నిజం ఉంది. ఒక ప్రాణం విలువను సినిమా టిక్కెట్ ను చించినట్లు చించి అవతలపడేయడం ఎంత వరకూ సమంజసం అని కూడా కొందరు ప్రశ్నిస్తున్నారు. టాలీవుడ్ లో హీరోలను, అందులోనూ మెగా కుటుంబాన్ని ఎదుర్కొనాలంటే ఎంతో కొంత ధైర్యం కావాలి. మెగా ఫ్యాన్స్ ను రాజకీయంగా దూరం చేసుకోవడానికి కూడా ఏ రాజకీయ పార్టీకి చెందిన నేత సాహసించరు.

**ధైర్యం కావాలి...**

కానీ రేవంత్ రెడ్డి మాత్రం అంతటి ధైర్యాన్ని ప్రదర్శించారు. రేవంత్ ను పొగడ్తలతో ముంచెత్తడం కాదు కానీ.. ఒక సినిమాకు సంబంధించి బెనిఫిట్ షో కు అనుమతి ఇచ్చింది ప్రభుత్వం. టిక్కెట్ ధరలు భారీగా పెంచుకోవడానికి అంగీకరించింది ప్రభుత్వమే. కానీ అప్పుడు నిజానికి సినిమా హీరో ఏం చేయాలి? లేదా టాలీవుడ్ ఏం చేయాలి? ఒక పదకొండు గంటలు జైలులో అదీ న్యాయస్థానం రిమాండ్ విధిస్తే ఉండి వస్తే ప్రపంచమే మునిగిపోయినట్లు, ఇక ఎంతో అన్యాయం జరిగినట్లు అంతా ఒక్కటై అల్లువారి ఇంటికి పెద్దల నుంచి పిల్లల వరకూ క్యూ కట్టారు. సానుభూతి ప్రకటించారు. పదకొండు గంటలు జైలులో ఉండి వస్తేనే ఇంతటి సానుభూతి కనిపిస్తే, ఇక ప్రాణం పోయిన కుటుంబానికి కనీసం ఓదార్పు లేకపోవడం సిగ్గు చేటు కాదా? అన్న ప్రశ్నకు టాలీవుడ్ లో ఎవరైనా సమాధానం ఇస్తారా? అంటే అదీ లేదు.


**ప్రీ రిలీజ్ ఫంక్షన్ లో....**

సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తడం తోనే అల్లు అరవింద్ ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న బాలుడిని పరామర్శించారు. నిజానికి హీరో యిజం అంటే ఏంటి? జనం వెంట నడవాలి. అంతే కాని జనాన్ని తొక్కుకుంటూ పరుగులు పెట్టడం కాదు. ఒక్క పుష్ప సినిమా బెనిఫిట్ షోతో జరిగిన మరణం ఇంతటితో ఆగిపోదు. డబ్బుల కోసం భవిష్యత్ లో కూడా ప్రీ రిలీజ్ ఫంక్షన్ల పేరుతో ఫ్యాన్స్ ను ఎక్కడినుంచో రప్పించి ఒక ఐదు నిమిషాలు మాట్లాడి ముద్దులు గాల్లో పెట్టేసి వెళ్లిపోతారు. కానీ దూర ప్రాంతం నుంచి బస్సుల్లో, లారీల్లో, వాహనాల్లో వచ్చి అనేక మంది ప్రమాదాల బారిన పడి మరణించినా వారికి పట్టదు. వారికి బాక్సాఫీస్ వద్ద కరెన్సీ నోట్లు కలెక్షన్ల రూపంలో కనిపించాలే తప్ప, ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నా ఎవరు పట్టించుకోరు. ఒక స్టేట్ మెంట్ తో దులిపేసుకుపోవడం సినిమా ఇండస్ట్రీలో సర్వసాధారణమయింది.

**నిజమైన హీరో రేవంత్....**

అందుకే రేవంత్ రెడ్డి అందులో ఏం తప్పులేదు. ఆయన నిజంగా మానవత్వంతో ఒక నేతగా జనం ముందు నిజమైన హీరోగా నిలిచాడనే చెప్పాలి. ఎందుకంటే టాలీవుడ్ తో పెట్టుకోవడం అంటే కొరివితో తల గోక్కోవడం అని ప్రతి రాజకీయ నాయకుడికి తెలుసు. కానీ రేవంత్ రెడ్డికి తన రాజకీయ భవిష్యత్ ను పక్కన పెట్టి ఆయన తీసుకున్న నిర్ణయం శభాష్ అని చెప్పాలి. ఎన్నిసార్లు ప్రశంసించినా సరిపోదు. ఆ గట్స్ కేవలం పాలిటిక్స్ లో కొందరికే ఉంటుంది. అటువంటి గుండె ధైర్యం ఉన్న నేతల్లో రేవంత్ ఒకరిగా నిలిచిపోతాడు. వెండితెర మీద చూసి ఎగిరి గంతేసే ఫ్యాన్స్ సంగతి పక్కన పెడితే సామాన్యుల నుంచి ఉన్నత వర్గాల వరకూ అంతా రేవంత్ రెడ్డి వెంటే ఉంటారు. అందుకే ఇక బెన్ ఫిట్ షో ఉండవు.. ధరల పెంచుము అన్న రేవంత్ నిర్ణయానికి యావత్ రెండు రాష్ట్రాల తెలుగు ప్రజలు ఫిదా అవుతున్నారు

# ఇంద్రకీలాద్రిపై రెండోరోజూ జోరుగా భవానీ దీక్ష విరమణలు



హైదరాబాద్ పెన్ పవర్: భవానీ దీక్షా విరమణలు రెండవ రోజు ఉదయం నుంచి భక్తులు హోమగుండముల వద్ద నేతి కొబ్బరికాయలు,పూజా ద్రవ్యములు సమర్పించుకున్నారు. భవానీ దీక్షా విరమణల సందర్భంగా యాగశాల దగ్గర శత చండీ యాగం జరుగుతోంది. డిసెంబర్ 21 నుండి 25 వరకు 5 రోజుల పాటు యాగం జరగనుందని అధికారులు తెలిపారు. భవానీ దీక్షా విరమణల పురస్కరించుకొని ఈ ఐదు రోజులలో భక్తులందరికీ దర్శనం ఉచితమని, అంతరాలయం, దర్శన టిక్కెట్లు ఉండవని, ఆర్జిత సేవలు నిలుపుదల చేసినట్లు ఈవో తెలిపారు. అన్ని లైన్ లు ఉచితమని, ఉదయం 3 నుండి రాత్రి 11 గం. ల వరకు అమ్మవారిని దర్శించుకోవచ్చునని తెలిపారు.విజయవాడ ఇంద్రకీలాద్రి అమ్మవారిని హోం మంత్రి వంగలపూడి అనిత దర్శించుకున్నారు. మంత్రికి ఆలయ మర్యాదలతో ఆలయ ఈవో కె. ఎస్. రామారావు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం ఆలయ వేద పండితులు వేదాశీర్వచనం చేయగా ఆలయ ఈవో అమ్మవారి శేషవస్త్ర%శీ%, ప్రసాదం చిత్రపటాలను అందజేశారు. హోం మంత్రితో పాటు పోలీస్ కమీషనర్ రాజశేఖర్ బాబు సైతం ఉన్నారు. భవానీ దీక్షల సందర్భంగా భక్తుల సౌకర్యార్థం చేసిన ఏర్పాట్లను గురించి మంత్రికి పోలీస్ కమీషనర్ , ఆలయ ఈవోలు వివరించారు. అమ్మవారి దర్శనం నకు విచ్చేసిన పలువురు భవానీ భక్తులతో మాట్లాడి ఏర్పాట్ల పై భక్తుల అభిప్రాయాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ ,గ్రామీణ అభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క కనక దుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ మర్యాదలతో ఆలయ అధికారులు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం ఆలయ వేద పండితులు వేదాశీర్వచనం చేయగా ఆలయ అధికారులు శ్రీ అమ్మవారి శేషవస్త్ర ప్రసాదం, చిత్రపటాలను అందజేశారు.

# వదల బొమ్మాళి వదల.. చంద్రబాబును అరెస్టు చేసిన అధికారిపై యాక్షన్

హైదరాబాద్ పెన్ పవర్: టీడీపీ అధినేత, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబును గతంలో అరెస్టు చేసిన సీఐడీ మాజీ డీజీ సంజయ్ కు చిక్కులు ఎక్కువయ్యాయి. అవినీతి ఆరోపణలపై ప్రస్తుతం సస్పెన్షన్లో ఉన్న ఆయన ప్రాసిక్యూషన్ కు ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. దీంతో మాజీ డీజీ అరెస్టు అయ్యే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. గత ప్రభుత్వంలో సీఐడీ చీఫ్, ఫైర్ సర్వీసెస్ డీజీగా ఉండగా, ఆయన ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేశారని ప్రభుత్వం ఆరోపిస్తోంది. దీనిపై ప్రాథమిక విచారణ చేపట్టి ఆయనను సస్పెండ్ చేసింది. ఇప్పుడు ప్రాసిక్యూషన్ కు అనుమతివ్వడంతో సంజయ్ కు కష్టాలు తప్పేలా లేవంటున్నారు.

గత ప్రభుత్వంలో కీలక పోస్టుల్లో పనిచేసిన సంజయ్ అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేశారని విజిలెన్స్ విచారణలో తేలింది. దీంతో ప్రభుత్వం ఆయనను సస్పెండ్ చేసింది. అఖిల భారత సర్వీసు అధికారులు క్రమశిక్షణ చట్టం 1969లోని సెక్షన్ 3(1) కింద చర్యలు తీసుకుంది. సంజయ్ పై విచారణ జరపాలని ఏసీబీని ఆదేశించింది. అయితే అవినీతి నిరోధక చట్టం 17ఏ ప్రకారం ఒక ప్రభుత్వ అధికారిపై విచారణ జరపాలంటే ఆయనను తొలగించే అధికారం ఉన్న అధికారి అనుమతిని తప్పనిసరిగా తీసుకోవాలి. దీంతో డీజీ స్థాయి అధికారిని విచారించాలంటే ప్రభుత్వం ప్రత్యేక అనుమతి ఇవ్వాలని ఏసీబీ లేఖ రాయడంతో సంజయ్ ప్రాసిక్యూషన్ కు ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. దీంతో సంజయ్ పై ఉచ్చుబిగించేందుకు ఏసీబీకి లైన్ క్లియర్ అయినట్లైంది. అంతేకాకుండా అభియోగాలు ఎదుర్కొంటున్న ఈ సీనియర్ పోలీసు అధికారి విజయవాడ దాటి వెళ్లకూడదంటూ ఆంక్షలు విధించింది. తాజా ప్రభుత్వ ఆదేశాలతో ఏసీబీ అధికారులు సంజయ్ ను అదుపులోకి తీసుకుని అరెస్టు చేసే అవకాశాలు ఉన్నాయంటున్నారు.




గత ప్రభుత్వంలో ఫైర్ సర్వీసెస్ డీజీగా పనిచేసిన సంజయ్ అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్లాయి. అగ్ని ఎన్వోసీ టెండర్ల ప్రక్రియలో అక్రమాలు, నిబంధనల అమలులో అవకతవకలు జరిగాయని విజిలెన్స్ అధికారులు గుర్తించారు. గత ప్రభుత్వంలో అగ్ని పోర్టల్ ఎన్వోసీలు, హార్డ్ వేర్ సరఫరా కోసం రూ.2.29 కోట్లకు సౌత్రికా టెక్నాలజీ అండ్ ప్రైవేటు లిమిటెడ్ తో ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంలో సదరు కంపెనీకి ముందుగా రూ.59.93 లక్షలు చెల్లించారని, నెల రోజుల్లో కేవలం 14 శాతం ప్రాజెక్టు పనులు మాత్రమే పూర్తి చేశారని విజిలెన్స్ అధికారులు గుర్తించారు. అదేవిధంగా మైక్రోసాఫ్ట్ లాప్ ట్యాప్, యాపిల్ ఐ ప్యాడ్ వంటి ఖరీదైన ఎలక్ట్రానిక్స్ ను నేరుగా కొనుగోలు చేశారని గుర్తించింది. టెండర్ లేకుండా ఇలా నేరుగా కొనుగోలు చేయడం వల్ల ప్రభుత్వానికి 17.89 లక్షల నష్టం వాటిల్లినట్లు గుర్తించారు.

ఫైర్ సర్వీసెస్ డీజీగా సంజయ్ అక్రమాలను తీవ్రతీయాలని ప్రభుత్వం నిర్ణయించడంతో ఆయనకు చిక్కులు తప్పేలా లేవంటున్నారు. వాస్తవానికి గత ప్రభుత్వంలో అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు అరెస్టు సమయంలో సంజయ్ కీలకపాత్ర పోషించారు. చంద్రబాబును విచారణకు పిలవకుండానే అరెస్టు చేయాలని ఆదేశాలిచ్చారు. అంతేకాకుండా తన నిర్ణయాన్ని సమర్థించుకుంటూ అప్పటి అడ్వకేట్ జనరల్ పొన్నవోలుతో కలిసి విజయవాడ, హైదరాబాద్, ఢిల్లీ వెళ్లి ప్రెస్ మీట్లు నిర్వహించారు. దీంతో ఆయన టీడీపీకి టార్గెట్గా మారారు. చంద్రబాబు అక్రమ అరెస్టుకు ఆదేశాలివ్వడమే కాకుండా రాజకీయ నాయకుడి తరహాలో మీడియా సమావేశాలు నిర్వహించడంతో విమర్శలు పాలయ్యారు. నాటి యాక్షన్ కు కొనసాగింపుగానే ఇప్పుడు ఆయనపై రియాక్షన్ ఉంటున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఏదిఏమైనా చంద్రబాబును అరెస్టు చేయడమే నేడు సంజయ్ కి ఈ కష్టాలు తెచ్చిపెట్టినట్లు కనిపిస్తోందంటున్నారు.

# ఇది కరెక్ట్ కాదు.. అల్లు అర్జున్ ఇంటిపై దాడిని ఖండించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్ పెన్ పవర్: టాలీవుడ్ హీరో అల్లు అర్జున్ ఇంటిపై జరిగిన దాడిని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఖండించారు. ఈ ఘటనపై ఎక్స్ (ట్విట్టర్) వేదికగా రియాక్ట్ అయిన కిషన్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై ఫైర్ అయ్యారు. "నటుడు అల్లు అర్జున్ నివాసంపై జరిగిన రాళ్ల దాడి ఘటన రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో శాంతిభద్రతల వైఫల్యాన్ని ఎత్తి చూపుతోంది. ఈ ఘటన పౌరుల భద్రత, శాంతి భద్రతలను రక్షించడంలో కాంగ్రెస్ అసమర్థ పరిపాలనను ప్రతిబింబిస్తోంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కళాకారులను, సినీ పరిశ్రమను టార్గెట్ చేయడం ప్రమాదకరమైన ఆనవాయితీగా మారింది" అని విమర్శలు గుప్పించారు.

ఈ ఘటన కాంగ్రెస్‌కు మద్దతుగా జరిగిందా లేక స్పాన్సర్డ్‌గా జరిగిందా అని నిలదీశారు కిషన్ రెడ్డి. కాగా, 2024, డిసెంబర్ 22న హైదరాబాద్




జూబ్లీహిల్స్‌లోని అల్లు అర్జున్ నివాసంపై ఓయూ జేఏసీ నేతలు దాడికి దిగిన విషయం తెలిసిందే. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో మృతి చెందిన రేవతి కుటుంబాన్ని ఆదుకోవాలని అల్లు అర్జున్ ఇంటి ముందు ఆందోళనకు దిగారు. ఈ క్రమంలోనే అల్లు అర్జున్ ఇంటిపై రాళ్లు, టమాటాలు రువ్వి.. ఇంట్లోని పూల కుండీలను ధ్వంసం చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు ఆందోళన కారులను అదుపులోకి తీసుకున్నారు.

## అలాంటి వారికి దూరంగా ఉండండి: అభిమానులకు అల్లు అర్జున్ విజ్ఞప్తి



హైదరాబాద్ పెన్ పవర్: అ సోషల్ మీడియాలో నెగెటివ్ పోస్టులు పెట్టే వారికి దూరంగా ఉండాలని అభిమానులకు అల్లు అర్జున్ సూచించారు. ఈ మేరకు సోషల్ మీడియా ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. తమ అభిప్రాయాలను బాధ్యతాయుతంగా వ్యక్తపరచాలని, ఎవరినీ వ్యక్తిగతంగా కించపరిచే విధంగా పోస్టులు పెట్టవద్దని అభిమానులను అల్లు అర్జున్ కోరారు. ఫ్యాన్స్ ముసుగులో గత కొన్ని రోజులుగా ఫేక్ ఐడీ, ప్రొఫైల్స్‌తో పోస్టులు వేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆన్‌లైన్‌లోనే కాదు ఆఫ్‌లైన్‌లోనూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అల్లు అర్జున్ కోరారు.

## డిజిటల్ అరెస్టులపై సజ్జనార్ ట్వీట్

### సైబర్ మోసాల్లో చిక్కుకోవడానికి అవగాహనా లోపమే కారణమని వెల్లడి

### నేరం ఏదైనా సరే డిజిటల్ గా అరెస్ట్ చేయరన్న మాజీ పోలీస్ బాస్

### వ్యక్తిగత వివరాలను పోలీసులు ఫోన్ ద్వారా అడగరని వివరణ




హైదరాబాద్ పెన్ పవర్: సైబర్ మోసాల్లో చిక్కుకోవడానికి అవగాహనా లోపమే ప్రధాన కారణమని ఆర్టీసీ ఎండీ, ఐపీఎస్ ఆఫీసర్ సజ్జనార్ చెప్పారు. ఇటీవలి కాలంలో పెరుగుతున్న డిజిటల్ అరెస్ట్ కేసులపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ట్వీట్ చేశారు. "నేరం ఏదైనా సరే 'డిజిటల్ అరెస్ట్' అనేదే ఉండదు. దర్యాప్తు అధికారులు నేరుగా వచ్చి నేరస్తులను అరెస్ట్ చేస్తారు. డిజిటల్ అరెస్ట్ పేరుతో ఎవరైనా బెదిరిస్తే అది మోసం అని గుర్తించండి. సైబర్ మోసాల్లో చిక్కుకోవడానికి కారణం అవగాహనా లోపమే. మన దేశంలోని ఏ దర్యాప్తు సంస్థ కూడా ప్రజల వ్యక్తిగత వివరాలను ఫోన్ ద్వారా అడగదు. లా ఎన్ ఫోర్స్ మెంట్ ఏజెన్సీలు ఫోన్ లేదా ఆన్ లైన్ ద్వారా బెదిరింపులకు పాల్పడవు. ఎవరైనా బెదిరిస్తే వారు నకిలీలని అర్థం. డిజిటల్ అరెస్ట్ పేరుతో ఫోన్ కాల్ వస్తే భయపడకుండా మీ సమీపంలోని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయండి. ఏమాత్రం ఆలస్యం చేయకుండా నేషనల్ సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930కు కాల్ చేసి సమాచారం అందించండి" అంటూ సజ్జనార్ ప్రజలకు సూచించారు.

## భర్త ప్రాణం తీసిన భార్య అప్పు.. నాగర్ కర్నూల్ లో విషాదం



**హైదరాబాద్ పెన్ పవర్:** భార్య చేసిన అప్పు భర్త ప్రాణం తీసింది.. అప్పిచ్చిన వ్యక్తి ఇంటికి వచ్చి నిలదీయడంతో మనస్తాపం చెందిన ఆ భర్త ఇంట్లో ఉరేసుకున్నాడు. చుట్టుపక్కల వారు గమనించి ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం ఆసుపత్రిలో కన్నుమూశాడు. నాగర్ కర్నూల్ జిల్లాలో జరిగిందీ విషాద సంఘటన. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని మధురానగర్ కాలనీకి చెందిన గున్న ముత్యాలు (56), రజిత భార్యాభర్తలు. ముత్యాలు డీఎంహెచ్ ఓ ఆఫీసులో అటెండర్ గా పనిచేస్తుండేవాడు. రజిత కొంతకాలం నర్సుగా పనిచేసి తర్వాత మానేసింది.

ఈ క్రమంలోనే ముత్యాలుకు తెలియకుండా రజిత ఓ వ్యక్తి వద్ద రూ.1.50 లక్షలు అప్పు చేసింది. తిరిగి చెల్లించడంలో జాప్యం జరుగుతుండడంతో సదరు వడ్డీ వ్యాపారి శనివారం రజిత ఇంటికి వచ్చి నిలదీశాడు. తన డబ్బులు ఎప్పుడు తిరిగిస్తావంటూ నిలదీశాడు. భార్య అప్పు చేసిందని తెలిసి ముత్యాలు ఆశ్చర్యపోగా.. వడ్డీ వ్యాపారి గొడవతో చుట్టుపక్కల వాళ్ల ముందు తలెత్తుకోలేనని మనస్తాపానికి గురయ్యాడు. ఆవేదనతో ఇంట్లో ఫ్యాన్ కు ఉరి వేసుకున్నాడు. చుట్టుపక్కల వారు గమనించి ముత్యాలును కిందకు దించారు. హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ముత్యాలు చనిపోయినట్లు ఆదివారం వైద్యులు ప్రకటించారు.

## ఎక్కడికి వెళ్లినా కాకా కుమారుడిగా ఎనలేని గౌరవం దక్కుతుంది




**హైదరాబాద్ పెన్ పవర్:** అంబేద్కర్ కాలేజీలో కాకా వెంకటస్వామి 10 వ వర్ధంతి వేడుకలు జరిగాయి. కాకా స్ఫూర్తితోనే తెలంగాణ కోసం కోట్లాడామని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి తెలిపారు. పేద విద్యార్థులకు ఉచితంగా విద్యనందిస్తున్నామన్నారు. కార్పొరేట్ కాలేజీలకు ధీటుగా ఈ విద్యాసంస్థలను నెలకొల్పామని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. విద్యతో పాటు స్కిల్ డెవలప్ మెంట్ కోర్సు ప్రవేశపెడతామన్నారు. తాను ఎక్కడికి వెళ్లినా.. కాకా కుమారుడిగా ఎనలేని గౌరవాన్ని పొందుతానన్నారు. అంబేద్కర్ లా కాలేజీకి జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చిందన్నారు. పట్టుదలతో... క్రమశిక్షణతో ఇక్కడ విద్యనందిస్తున్నామన్నారు. పేద విద్యార్థుల కోసమే అంబేద్కర్ కాలేజీని స్థాపించామన్నారు. ఈ కాలేజీ విద్యార్థులకు ఫీ రిఎంబర్స్ మెంట్ కూడా వర్తిస్తుందన్నారు. త్వరలో అంబేద్కర్ కాలేజీ అటానమస్ కాలేజీ కాబోతుందన్నారు.

అంబేద్కర్ కళాశాల కి న్యాక్ గుర్తింపు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కాలేజీలో లా కోర్సు చదివిన వారు జడ్జీలు కూడా అయ్యారని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. ఈ కాలేజీలో డొనేషన్ ఉండదన్నారు. మంచి విద్య ఉన్నపుడే సమాజం లో గుర్తిపు ఉంటుందన్నారు.

## డిసెంబర్ 4న సంధ్య థియేటర్ దగ్గర అసలేం జరిగింది..?

# మినిట్ టూ మినిట్ వీడియో రిలీజ్ చేసిన సీపీ




**హైదరాబాద్ పెన్ పవర్:** పుష్ప-2 ప్రీమియర్ షో సందర్భంగా ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని సంధ్య థియేటర్ దగ్గర జరిగిన తొక్కిసలాట ఘటన స్టేట్‌లో తీవ్ర దుమారం రేపుతోంది. అనుమతి లేకుండా అల్లు అర్జున్ థియేటర్‌కు వెళ్లడంతోనే తొక్కిసలాట జరిగిందని సీఎం రేవంత్ రెడ్డి అనగా.. పోలీసుల పర్మిషన్‌తోనే థియేటర్‌కు వెళ్లానని.. తొక్కిసలాట జరిగి ఓ మహిళ మృతి చెందిన విషయం సినిమా చూసే సమయంలో తనకు తెలియదని అల్లు అర్జున్ వాదిస్తున్నాడు. ఈ క్రమంలో 2024, డిసెంబర్ 4వ తేదీ రాత్రి పుష్ప 2 ప్రీమియర్ షో సందర్భంగా సంధ్య థియేటర్ దగ్గర అసలేం జరిగిందనే దానిపై హైదరాబాద్ పోలీసులు ఆదివారం (డిసెంబర్ 22) మినిట్ టూ మినిట్ వీడియో రిలీజ్ చేశారు. ఈ ఘటనపై హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పుష్ప 2 ప్రీమియర్ షో చూసేందుకు అల్లు అర్జున్ థియేటర్‌కు వచ్చేందుకు పోలీసులు అనుమతి నిరాకరించారు. కానీ థియేటర్ యాజమాన్యం ఈ విషయం అల్లు అర్జున్‌కు చెప్పిందో లేదో తమకు తెలియదన్నారు సీపీ. ఈ ఘటనపై ఏసీపీ రమేష్ మాట్లాడుతూ.. "తొక్కిసలాట ఘటనను అల్లు అర్జున్‌కు చెప్పేందుకు ప్రయత్నించాం. మేనేజర్ సంతోష్ మమ్మల్ని అడ్డుకుని.. అల్లు అర్జున్‌కు విషయం నేనే చెబుతానని అడ్డుకున్నాడు. పరిస్థితి చేయి దాటి పోవడంతో నేనే స్వయంగా అల్లు అర్జున్ దగ్గరికి వెళ్లి తొక్కిసలాట గురించి చెప్పాను. ఓ మహిళ మృతి చెందింది.. ఒక బాలుడు అపస్మారక స్థితిలోకి వెళ్లాడని చెప్పి థియేటర్ నుండి వెళ్లిపోవాలని కోరాం. కానీ సినిమా మొత్తం చూశాకే వెళ్తానని అల్లు అర్జున్ అన్నాడు. యాక్షన్ తీసుకుంటామని హెచ్చరించడంతో ఆయన థియేటర్ నుండి వెళ్లిపోయాడు" అని క్లారిటీ ఇచ్చారు. ఇదిలా ఉంటే.. తొక్కిసలాటలో మహిళా మృతి చెందదన్న విషయం పోలీసులు తనకు చెప్పలేదని బన్నీ అంటోన్న విషయం తెలిసిందే.

# ఈ కుర్చీనాది.. ఈ కాలు నాది.. అంటే కుదరదు పుష్పా





**హైదరాబాద్ పెన్ పవర్:** పుష్ప సినిమా ప్రీమియర్ షో సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో ఒక మహిళ మరణించిన ఘటన టాలీవుడ్ ను షేక్ చేస్తుంది. ముఖ్యంగా ఇకపై సినీహీరోలు జనంలోకి రావడానికి ఈ ఘటన బ్రేక్ వేసిందనే చెప్పాలి. ఎందుకంటే ప్రభుత్వం ఈ విషయంలో సీరియస్ గా ఉంది. అయితే సంధ్యా థియేటర్ ఘటన రాజకీయంగా టర్న్ తీసుకుంది. అల్లు అర్జున్ కు మద్దతుగా కొన్ని పార్టీ నేతలు, వ్యతిరేకంగా మరికొందరు గళం విప్పుతుండటంతో ఇప్పట్లో ఈ రచ్చ ఆగేలా లేదు. ఎందుకంటే అల్లు అర్జున్ తప్పు చేశారని అధికార పార్టీ, లేదంటూ విపక్షాలు బహిరంగ ప్రకటనలు చేస్తూ, మరొక వైపు సోషల్ మీడియాలోనూ అనుకూలంగా, వ్యతిరేకంగా పోస్టులు కనిపిస్తుండటంతో ఈ ఘటన ఇంకా మరిచిపోయే పరిస్థితి కనిపించడం లేదు.

**చూసీ చూడనట్లు...**

అసెంబ్లీలో నిన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రకటనను చూసీ చూడనట్లు ఊరుకుంటే అల్లు అర్జున్ సరిపోయేది. కానీ అల్లు అర్జున్ మీడియా ముందుకు వచ్చి వివరణ ఇచ్చుకోవడం మళ్లీ కెలుక్కున్నట్లయింది. నిజానికి నెల రోజులు బెయిల్ అల్లు అర్జున్ కు లభించింది. ఈ నెలరోజులు అల్లు అర్జున్ మౌనంగానే ఉండటం మంచిది. ఎందుకంటే ఏమాత్రం తాను తొందరపడి కామెంట్స్ చేసినా అది రోజురోజుకూ ఘటన తీవ్రత మరింత పెరగడమే కాకుండా డ్యామేజీ అల్లు అర్జున్ కే ఎక్కువగా ఉంటుంది. వ్యక్తిత్వ హననం చేశారంటూ ఏకంగా ముఖ్యమంత్రి పై అల్లు అర్జున్ పరోక్షంగా కామెంట్స్ చేసినా ఈరోజు మాత్రం కాంగ్రెస్ నుంచి మంత్రులు, నేతలు విరుచుకుపడ్డారు.

**పొలిటికల్ లీడర్లతో పెట్టుకుంటే...**

రేవతి కుటుంబానికి ఇరవై కోట్లు నష్టపరిహారం చెల్లించాలంటూ డిమాండ్ మొదలయ్యాయి. అలాగే ఐకాన్ స్టార్ అయితే మాకేంటి? అన్న డైలాగులు కూడా నేతల నుంచి వినిపించాయి. రాజకీయ నేతల నోట్లో నోరు పెట్టడం కంటే పెదవి విప్పకపోవడమే మంచిదన్న సూత్రాన్ని తన మేనమామ చిరంజీవి నుంచి అల్లు అర్జున్ ఎంతైనా నేర్చుకోవాల్సి ఉంది. ఆవేపడి పొలిటికల్ లీడర్లా తాము కూడా ప్రజలకు వివరిద్దామని కుంటే అది భ్రమే అవుతుంది. ఎందుకంటే.. అల్లు ఇంటి నుంచి వినిపించే వాయిస్ ఒక్కటే అయితే.. రాజకీయాల నుంచి అనేక గొంతుల నుంచి ప్రతిధ్వనిస్తూనే ఉంటాయి. వాటిని ఆపడం ఎవరి తరమూ కాదు. ఇది తన కెరీర్ కు కొంత ఇబ్బంది కలుగుతుందని చెప్పలేం కానీ, ఆయన ఇలా మీడియా సమావేశాలు పెట్టడం మానేస్తే మంచిదన్న సూచనలు వెలువడుతున్నాయి.

**పోలీసులు వీడియోలను...**

కేవలం రాజకీయ నేతల నుంచి మాత్రమే కాదు ఇటు పోలీసు ఉన్నతాధికారులు కూడా రంగంలోకి దిగి అల్లు అర్జున్ కు కౌంటర్ ఇస్తున్నారు. ఆర్టీసీ క్రాస్ రోడ్డు వద్ద ఉన్న సంధ్య థియేటర్‌లో జరిగిన తొక్కిసలాట వీడియోలు కూడా బయటపెట్టారు. మౌనంగా ఉండటానికి మించి మరొకటి ఉండదు. లేదంటే మరో ఇరవై రోజులు ఎటైనా వెళ్లి అటు ఆటవిడుపుగా వెళ్లి సినిమా సక్సెస్ ను కుటుంబంతో కలసి ఎంజాయ్ చేసిరావడం మంచిదని అల్లు అరవింద్ కూడా చెప్పారంటే ఆయనకు ఈ విషయం తెలుసు. అందుకే ముఖ్యమంత్రి అన్నప్పటికీ దానికి మళ్లీ కౌంటర్ ఇవ్వకుండా చూసీ చూడనట్లు వదిలేస్తే దానికంటే ఉత్తమం మరొకటి ఉంటుందా? పుష్పా అని సోషల్ మీడియాలో కామెంట్స్ వినపడుతున్నాయి.